



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

సోమవారం 24 నవంబర్ 2025

వైఎస్ఆర్ కడప

పేజీలు - 08


కోర్టు ఉద్యోగాలంటూ

# టోకరా!

## రెండేళ్లుగా తిరుగుతున్న బాధితులు..

## డబ్బులు అడిగితే రాజకీయ బెదిరింపులు ..



**బ్రహ్మంగారిమఠం మేజర్‌న్యూస్:** కోర్టులో ఔట్ సోర్సింగ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగుల వద్ద లక్షల్లో వసూళ్లు చేసి టోకరా వేసిన బ్రహ్మంగారిమఠం మండలానికి చెందిన కోర్టులో పని చేస్తున్న ఉద్యోగి లక్షల్లో వసూలు చేశాడని బాధితులు ఆరోపిస్తున్నారు. కోర్టులో ఉద్యోగాలు ఉన్నాయని నా రాజకీయ పలుకుబడితో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నమ్మబలికి ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగానికి రెండు లక్షలకు బేరం కుదుర్చుకొని బాధితుల వద్ద అడ్వాన్స్‌గా లక్షల రూపాయలు వసూళ్లు చేసినట్టు విశ్వసనీయ సమాచారం. ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ డబ్బులు తీసుకొని రెండేళ్లు అవుతున్న ఉద్యోగాలు లేకపోవడంతో మోసపోయామని గ్రహించి అతని వద్దకు వెళ్లి మేము చెల్లించిన సొమ్ము వెంటనే ఇవ్వాలని వారు కోరగా సదరు ..మిగతా 2పేజీలో

పులుపు ఎక్కిన

# నిమ్మ ధరలు



**గిట్టుబాటు ధర లేక తోటలోనే వదిలేసిన కాయలు**

**కూలీల ఖర్చు కూడా రాక అల్లాడుతున్న రైతులు**

**దువ్వూరు, మేజర్‌న్యూస్:** గత కొంత కాలంగా సన్న నిమ్మ కాయలకు ధరలు తగ్గతూ వస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని దువ్వూరు, జిల్లెల్ల, బాకరాపురం, నారాయణపల్లె, బయనపల్లె గ్రామాలలో సన్ననిమ్మ పంట సాగు చేశారు. రైతులు పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో కూలీల ఖర్చులు చెల్లించలేక అవస్థలు పడుతున్నారు. పెట్టుబడులు ఎక్కువ. రాబడి తక్కువ అని రైతులు వాపోతున్నారు.గత ఏడాది ఇదే సీజన్లో మొదటి రకం రూ.40 నుంచి 50 రూపాయల వరకు పలకగా బస్తా రూ. 2000 పైనే అమ్ముడుపోయింది. ప్రస్తుతం దిగుబడులు బాగున్నా ధరలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కూలీలు, ఆటో బాడుగకు బస్తాకు ఖర్చు రూ. 500 నుంచి రూ. 700 వరకూ అవుతుండగా మార్కెట్లో మాత్రం రూ.300 మాత్రమే వస్తోందని రైతులు చెబుతున్నారు. బయట రాష్ట్రల ప్రభావంతో డిల్లీ, పాట్నా, కలకత్తా, వారణాసి, కేరళ తదితర ప్రాంతాలకు ఎగుమతులు ఎక్కువ ప్రస్తుతం అక్కడ మంచు ప్రభావం ..మిగతా 2పేజీలో



## ఉంటుందా?..ఊడుతుందా?

# నో..క్లారిటీ!

- బద్వేల్ విభజనపై కొనసాగుతున్న సస్పెన్స్
- స్పష్టమైన నిర్ణయానికి రాలేకున్న ప్రభుత్వం?
- అన్నమయ్యలో కలిపేందుకు ససేమిరా అంటున్న నియోజక వర్గ ప్రజలు
- పరిపాలనా ఇబ్బందులు తలెత్తే అవకాశం
- కడపతోనే కొనసాగించాలని మేధావుల పట్టు

బద్వేల్ - మేజర్‌న్యూస్

జిల్లాల పునర్విభజనపై అనుమానాలు కొనసాగుతూనే ఉన్నాయి. బద్వేల్ నియోజకవర్గం కడప జిల్లాలో ఉంటుందా?.. అన్నమయ్య జిల్లాలో కలుపుతారా?.. అనే దానిపై స్పష్టత రావడం లేదు. అన్నమయ్య జిల్లా నుంచి మదనపల్లి జిల్లా ఏర్పాటు ఖాయమైనప్పటికీ బద్వేల్‌పై మాత్రం ప్రభుత్వం ఒక నిర్ధారణకు రాలేదని తెలుస్తోంది. ప్రజా అభిప్రాయ సేకరణ, క్షేత్రస్థాయి పరిశీలన కోసం రాష్ట్ర ప్రభుత్వం మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేసిందని చెబుతున్నా.. ఆ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించినట్లు లేదు. కేవలం కొంత మంది నేతల అభిప్రాయాలతోనే ప్రభుత్వానికి ప్రతిపాదన సమర్పించింది. కేంద్రం మాత్రం సెప్టెంబర్ చివరిలోపు జిల్లాల పునర్విభజనపై ప్రతిపాదనలు, సరిహద్దులు పంపాలని రాష్టానికి నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కానీ రాష్ట్ర స్థాయిలో ఇంకా కసరత్తు కొనసాగుతూనే ఉంది. ఈనెల రెండో వారంలో మంత్రి వర్గ ఉపసంఘం సమావేశమై జిల్లాల పునర్ విభజనపై చర్చించింది. కానీ నిర్ధిష్ట నిర్ణయానికి రాలేకుంది. మరికొంత కసరత్తు అవసరమని భావిస్తోంది. ఫలితంగా బద్వేల్‌పై ఊహాగానాలు సాగుతూనే ఉన్నాయి.

2 పేజీలో

ఘనంగా శ్రీ సత్య సాయి బాబా

# శత జయంతి వేడుకలు

**అందరిని ప్రేమించాలి-అందరికీ సేవ చేయాలి అనే మార్గాన్ని అనుసరించాలి**

**జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి**



**కడప ప్రతినిధి - మేజర్‌న్యూస్:** అందరిని ప్రేమించాలి- అందరికీ సేవ చేయాలి అనే మార్గాన్ని అనుసరించేలా శ్రీ సత్యసాయి బాబా ప్రేరణ ఇచ్చారని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.ఆదివారం స్థానిక కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో శ్రీ సత్య సాయి బాబా శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తో పాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు తదితరులు పాల్గొన్నారు. ముం దుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ..మిగతా 2పేజీలో

# రైతన్నా.. మీకోసం!

**వ్యవసాయంలో పంచ సూత్రాలపై నేటి నుంచి ఏడు రోజులపాటు కార్యక్రమాలు**

**ప్రత్యేక కార్యాచరణ: జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**



**కడప ప్రతినిధి-మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా ఈ నెల 24 నుంచి రైతన్నా మీకోసం కార్యక్రమంలో అమలు చేస్తోందని జిల్లాలో ..మిగతా 2పేజీలో

అరటి పంటలను

# పరిశీలించిన ఎంపీ



**పులివెందుల, మేజర్‌న్యూస్:** పులివెందుల ప్రాంతంలోని అరటి రైతులు ధరలు లేక తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. మార్కెట్లో అరటి టన్ను ధర 1500 నుంచి 2500 3000 ఉండడంతో రైతన్నలు..మిగతా 2పేజీలో

# నో..క్లారిటీ!

**బద్వేల్ - మేజర్‌న్యూస్ :** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 13 ఉమ్మడి జిల్లాలను.. 26 జిల్లాలుగా విభజించారు. ఈ విభజనలో హేతుబద్ధత పాటించలేదన్న విమర్శ ఉంది. ప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోకుండా ఇష్టానుసారంగా జిల్లాల విభజన చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకే ఇప్పుడు వాటిని సరిచేసే పనిలో కూటమి ప్రభుత్వం పడింది. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు హామీ ఇచ్చారు. ఆమేరకు జిల్లాల పునర్విభజన పరిశీలనకు క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేశారు. ఏడుగురు మంత్రులను మూడు బృందాలుగా ఏర్పాటు చేశారు. ఈ బృందాలు ఆగస్టు 29, 30 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తాయిని షెడ్యూలు ప్రకటించారు. అందులో భాగంగా ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల్లో మంత్రి నాదెండ్ల మనోహర్, మంత్రి పొంగూరు నారాయణ పర్యటించాల్సి ఉంది. కానీ ఈ బృందాలు ఎక్కడా క్షేత్రస్థాయిలో పర్యటించిన దాఖలాలు లేవు. ఇప్పటికే అందిన ప్రతిపాదనలను అటూ..ఇటూ తిరగేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చేశాయి. వాస్తవానికి జిల్లాలు, మండలాలు, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పులపై పూర్తి స్థాయి అధ్యయనం చేయాలి. సెప్టెంబర్ 15వ తేదీ నాటికి ప్రభుత్వానికి తుది నివేదిక ఇవ్వాలని సీఎం చంద్రబాబు గత నెలలోనే స్పష్టమైన ఆదేశాలు చేశారు. కానీ నేటికి ఈ బృందం స్పష్టమైన నివేదిక ఇవ్వలేదు. కడప జిల్లా నుంచి బద్వేల్ నియోజక వర్గం విభజించడం, రాజంపేట జిల్లా ఏర్పాటు అంటూ పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. దీనిపై ఈ బృందం క్షుణంగా అధ్యయనం చేయాల్సి ఉంది. లిఖితపూర్వక ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ప్రజల నుంచి అభ్యంతరాలు, విజ్ఞప్తులు, సలహాల స్వీకరించి ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందించాలి. కానీ అన్నమయ్య జిల్లాలోని మదనపల్లిని కొత్త జిల్లాగా ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే సర్వం సిద్ధమైంది. అదే జరిగితే అన్నమయ్యలో రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు నియోజక వర్గాలు మాత్రమే మిగులుతాయి. దానికి తోడు జిల్లా కేంద్రం రాయచోటి నుంచి రాజంపేటకు తరలిస్తారని అందరూ భావించారు. కానీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఈ వాదనను తోసిపుచ్చుతున్నారు. రాయచోటి జిల్లా కేంద్రంగా కొనసాగుతుందని పదేపదే చెబుతున్నారు. దీంతో రాజంపేట జిల్లా కేంద్రం అనే ప్రతిపాదన అటకెక్కినట్లే. ఇక.. కడప జిల్లాలోని బద్వేల్ నియోజక వర్గ పరిస్థితి కొంత గందరగోళంగానే ఉంది. బద్వేల్‌ను అన్నమయ్య జిల్లాలో కలుపుతారన్న ఊహాగానాలు సాగుతున్నాయి. అయితే ప్రభుత్వం దీనిపై ఎటువంటి ప్రకటన చేయలేదు. ఇటీవల జరిగిన మంత్రి వర్గ ఉపసంఘం సమావేశంలోనూ బద్వేల్ ప్రస్తావనే లేదు. కానీ నియోజక వర్గ ప్రజల్లో అనుమానాలు వీడటం లేదు. కడపజిల్లాలోనే కొనసాగుతుందా?.. అన్నమయ్య జిల్లాలో కలుస్తుందా అనే దానిపై స్పష్టత లేదు. అయితే బద్వేల్‌ను అన్నమయ్య జిల్లాలో కలపే ప్రతిపాదనను నియోజక వర్గ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రస్తుతం బద్వేల్ నియోజక వర్గంలో ఏడు మండలాలు కొనసాగుతున్నాయి. కలసపాడు, బి.కోడూరు, శ్రీకాశినాయన, పోరుమామిళ్ళ, బద్వేల్, గోపవరం, అట్లూరు మండలాలున్నాయి. ప్రస్తుతం కడప-బద్వేల్ మధ్య 60 కి.మీటర్లు ఉంది. అదే పోరుమామిళ్ళ 79, కాశీనాయన 83.3 కి.మీటర్లు, కలసపాడు 93.3 కి.మీటర్ల దూరముంది. ఈ మూడు మండలాలతో పాటు బి.కోడూరు, గోపవరం, అట్లూరు మండలాల ప్రజలంతా బద్వేల్‌ను కేంద్రంగా చేసుకుంటారు. ఆ తరువాత కడపపై ఆధారపడతారు. పాలనాపరమైన అంశాలన్నీ బద్వేల్ డివిజన్ కేంద్రం నుంచే సాగుతుంటాయి. బద్వేల్‌కు పొరుగున మైదుకూరు, కడప నియోజక వర్గాలున్నాయి. దీంతో ప్రస్తుతం పాలనాపరమైన ఇబ్బందులు లేవనే చెప్పాలి. అయితే ప్రస్తుతం బద్వేల్‌ను రాజంపేటలో కలిపే తీవ్ర ఇబ్బందులు ఎదురు కాకతప్పదు. బద్వేల్ నుంచి నూతన ప్రతిపాదిత జిల్లా కేంద్రానికి చేరుకోవాలంటే 76 కి.మీటర్లు ప్రయాణం చేయాలి. అదే నియోజక వర్గ పరిధిలోని పోరుమామిళ్ళ నుంచి రాజంపేటకు 144 కి.మీటర్లు, కాశీనాయన నుంచి 148 కి.మీటర్లు, కలసపాడు నుంచి రాజంపేట వెళ్ళాలంటే 150 కి.మీటర్లు ప్రయాణించక తప్పదు. దీన్ని నియోజక వర్గ ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ప్రస్తుతం కడప జిల్లా కేంద్రంగా పాలనసౌలభ్యంతో కొనసాగుతోంది. వ్యాపార, వాణిజ్య, సేవా రంగాలకు, విద్యా, వైద్యం వంటివాటికి కూడా కడప అనుకూలంగా ఉంది. అందువల్లే తమను కడప జిల్లాలోనే కొనసాగించాలని గట్టిగా కోరుతున్నారు. విభజిస్తే తీవ్ర ఆందోళనలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే నియోజక వర్గ ప్రజలు కొత్త ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ నిరసనల బాట పట్టారు. అన్ని రాజకీయ పార్టీల నేతలు కూడా ప్రజా నిరసనకు మద్దతునిస్తున్నారు. కానీ ప్రభుత్వ ప్రకటన ఏదీ వెలువడకపోవడంతో నియోజక వర్గంలో శాంతియుత వాతావరణం కొనసాగుతోంది.

## ఘనంగా శ్రీ సత్య సాయి బాబా శత జయంతి వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ మానవాళికి సేవ చేయడమే భగవంతుని సేవ'అనే నమ్మకాన్ని సత్యసాయి బాబా ప్రచారం చేశారని అన్నారు. ఆయ న ఆధ్యాత్మికతను నిస్వార్థ సేవను, వ్యక్తిగత పరివర్తనను అలవర్చుకోవాలని బోధించారన్నారు.సాయిబాబా లక్షలాది మంది సేవా మార్గాన్ని అనుసరించడానికి ప్రేరేపించారని అన్నారు. అనేక దేశాల్లోనూ ఆయన భక్తులు ప్రజలకు నిస్వార్థ సేవ అందిస్తున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సత్య సాయి బాబా జయంతి ఉద్యమాలు ఘనంగా జరుగుతున్నాయన్నారు. 1950 ఆశ్రమం స్థాపించినప్పుడు అనంతపురం జిల్లా వెనుకబడిన కరువు జిల్లాగా ఉండేదని ఆశ్రమం స్థాపించిన తర్వాత ఆ ప్రాంత ప్రజలకు వైద్యం విద్య త్రాగునీరును ఆశ్రమం ద్వారా అందించడం జరిగిందన్నారు. ప్రపంచ స్థాయి విద్యను ఒక రూపాయి ఖర్చు లేకుండా అందించడం జరుగుతుందన్నారు. ఉన్నత స్థాయి వైద్య పరికరాలతో ప్రజలకు వైద్యాన్ని అందిస్తున్నారన్నారు. 2008-09 సంవత్సరంలో హైదరాబాద్ నుంచి స్నేహితులతో కలిసి ఆయన దర్శనానికి వెళ్ళామని కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. ఆయన సత్యసాయిబాబా సంస్థను ఏర్పాటుచేసి ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. సత్య సాయి బాబా సంస్థ ఎలాంటి లాభా పేక్ష లేకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా అందించే వ్యాలెంటరీ వ్యవస్థను అందించడం జరిగిందన్నారు. ఆయన అందించిన వాలెంటరీ వ్యవస్థ రాష్ట్రంలో జరిగే పుష్కరాలు వంటి కార్యక్రమాలలో ప్రజలకు అనేక రకాలుగా సేవలందించడం జరుగుతోందన్నారు. ఆయన అందించిన లవ్ ఆల్ సర్వ్ ఆల్ నినాదాన్ని ఆధ్యాత్మిక భావాలను అనుసరించాలనీ కోరారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ సత్య సాయిబాబా దేవుడు బయటి లేదని మనలోనే ఉన్నారన్నారన్నారు. ఆయన అనుసరించిన సేవా గుణాన్ని అలవర్చుకోవాలని అన్నారు. ఆయన స్థాపించిన ట్రస్టు ద్వారా అందించిన విద్య, త్రాగు నీటి, వైద్య సేవలు ఎనలేవని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన బోధించిన మార్గాలను అనుసరించి మానవత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు
ఈ కార్యక్రమంలో ఎస్డిసి వెంకటపతి,డిఆర్డిఏ పిడి రాజ్యలక్ష్మి జిల్లా పర్యాటకశాఖ అధికారి సురేష్, కలెక్టరేట్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు ఉద్యోగాలంటూ టోకరా..!

ఉద్యోగినాకు రాజకీయ అండదండలు పుష్కలంగా ఉన్నాయంటూ డబ్బులు చెల్లించిన బాధితులను బెదిరింపులకు పాల్పడుతున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. కోర్టులలో ఉద్యోగాలు ఇప్పి స్తానంటూ నమ్మబలికిన ఆ ఉద్యోగి బ్రహ్మంగారిమఠం మండలానికి చెందిన వాడుకావడం కోర్టులో గుమస్తా ఉద్యోగం చేస్తున్నాను నమ్మి పలుకుతూతెలిసిన వారందరితో ఉద్యోగాలు ఇప్పిస్తామని మాయ మాటలు చెప్పి లక్షల్లో వసూల్ చేశాడు అయితే సొంత మండలం వారితో కాకుండా బద్వేలు బి కోడూరు తదితర మండలాల వారితో చాకచక్యంగా ఉద్యోగాల పేరిట భారీగావసూలు చేసు కున్నాడు గతంలో బద్వేలు ప్రొద్దుటూరు కోర్టుల్లో పని చేసినట్లు బాధితులు చెబుతున్నారు. బాధితులు డబ్బులు చెల్లించాలంటూ అతన్ని అడగ అధికార పార్టీ నా వెనక ఉంది అంటూ బెదిరింపు ధోరణితో పాల్పడుతుండడంతో అటు ఉద్యోగాలు రాకడబ్బులు పోగొట్టుకున్న బాధితులు లబోదిబోమంటున్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ చెప్పడంతో ఇతరుల వద్ద అప్పులు చేసి మరీ చెల్లించామని మా డబ్బులు మాకు ఇవ్వమని ఎంత బ్రతిమాలిన ఇచ్చేది లేదంటూ బెదిరిస్తున్నాడని బాధితులు ఆరోపిస్తున్నారు.

## రైతన్నా.. మీకోసం!

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్ర మాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు తగుకార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత శాఖ అధికారులను టెలికా న్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో పెను మార్పుల ద్వా రా సాగును లాభసాటి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతోందని, ఇందులో భాగంగా పంచ సూత్రాల ద్వారా రైతులకు మేలు చేసే కార్యక్రమాలపై ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు ప్రతీ రైతుఇంటికి ప్రజా ప్రతి నిధులు,అధికారులు వెళ్లనున్నారని తెలిపారు. డిసెం బర్ 3వ తేదీన రైతు సేవా కేంద్రాల పరిధిలో వర్క్ షాపులు చేపట్ట నున్నారని, ఈ కార్యక్రమంలో వ్యవసాయ అను బంధ రంగాలు, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నా రు. అన్నదాతల సంక్షేమం కోసం, సాగు విధానంలో తీసు కు రావాల్సిన మార్పులపై ముఖ్యమంత్రి ప్రకటించిన పంచ సూత్రాలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది ఈ కార్యక్రమంలో కీలక భూమిక పోషించనుంది. అన్నదాతలకు మరింత మేలు చేకూర్చేలా పంచ సూత్రాలను,నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు,అగ్రిటెక్,ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు అనే అంశాలతో పంచ సూత్రాల విధానాన్ని చేపట్టారని,ఈ పంచ సూత్రాలను ప్రతి రైతుకే కాకుండా రైతు కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలని, రైతులతో పాటు పాడి రైతులు, పౌల్ట్రీ, గొర్రెల పెంపకం దారులు, ఆక్వా, ఉద్యాన, సెరీ కల్చర్ రైతలకూ అవగా హన కల్పించాలన్నారు.ఈ కార్యక్రమానికి రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది ముందుండి చేపట్టాలని, దీంతో పాటు వర్క్‌షాప్‌లు కూడానిర్వహించాలని న్నారు. ప్రతి రైతు సేవా కేంద్రాల్లో కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. రైతులకు వ్యవసాయం గిట్టుబాటు అయ్యేలా ఆధునిక పద్ధతుల ద్వారా పంటలకు మరింత విలువ జోడించేలా ప్రభుత్వం తీసు కుంటున్న చర్యలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని,శాస్త్రీయ వ్యవసాయంతోనే రైతుకు గిట్టుబాటు అవుతుందని, ప్రకృతి సేద్యాన్ని మరింతగా ప్రోత్సహించాలన్నారు. దీని వల్ల భూసార రక్షణతో పాటు ఆరోగ్యం కూడా బాగుంటుందని, రైతు బజార్లలోనూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మరింత ప్రమోట్ చేయాలన్నారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## పులుపు ఎక్కిన నిమ్మ ధరలు

(మొదటి పేజీ తరువాయి)



అధికంగా ఉండడంతో కొనుగోలుదారులు ఆసక్తి చూపడం లేదు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రంలో సాగు బాగుండటంతో స్థానికంగా ధరలు తగ్గాయని వ్యాపారులు అంటున్నారు.మండలంలో సాగుచేసిన సన్న నిమ్మకాయల రైతుల పట్ల ప్రభుత్వం స్పందించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు, రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.

## అరటి పంటలను పరిశీలించిన ఎంపీ

(మొదటి పేజీ తరువాయి)

సాగుచేసిన పెట్టుబడులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డి పల్లె బ్రాహ్మణపల్లె గ్రామాలలో రైతులు సాగుచేసిన అరటిపంటలను పరిశీలించారు. ధర లేక అరటి రైతులు తోటలోనే అరటి కాయలను అలాగే వదిలేస్తున్నారు. మరికొందరు రైతులు పంటలను గొర్రెలకు మేకలకు మేతగా వేస్తున్నారు. ఆదివారం కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డి పల్లె బ్రాహ్మణపల్లె గ్రామాల్లో సాగుచేసిన అరటి పంటలను పరిశీలించారు. అరటిపంటకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన 18 నెలలు అవుతున్న రైతులకు వారు పండించిన పంటలకు కనీసం గిట్టుబాటు ధరలు కూడా కల్పించలేదన్నారు. ఇటు అరటి రైతులతోపాటు చేని రైతులు తమ పండించిన పంటలకు కనీస గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు చీని రైతులు తమ పండించిన పంటలకు కనీస గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట ఏ పుగా పెరిగిన మార్కెట్లో ధరలు లేకపోవడంతో రైతులు కుదేలవుతున్నారు అన్నారు ఈ కార్యక్రమంలో నల్లపురెడ్డిపల్లి కి చెందిన రైతు అజ్జుగుట్ట భాస్కర్ రెడ్డి వైఎస్ఆర్ సీపీ నాయకులు రసూల్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## భగవాన్ సత్యసాయి ఆశీస్సులు అందరికి ఉండాలి



**కడప టౌన్, మేజర్ న్యూస్:** ఉచిత విద్య, వైద్యం తమ సత్య సాయి ట్రస్టు ద్వారా ప్రజలకు అందిస్తున్న భగవాన్ శ్రీ సత్యసాయి బాబా సేవలు మరువలేనివని కొండా పాలకొండయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొండ సుబ్బయ్య అన్నారు. పుట్టపర్తి శ్రీ సత్య సాయి బాబా 100 వ జయంతి ఉత్సవాల సందర్భంగా కడప నగరంలోని ఎస్.బి.ఐ కాలనీ లో ఉన్న ఆయన మందిరం నందు కొండా సుబ్బయ్య ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టపర్తి నందు ఆయన 100వ జయంతి సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా ప్రభుత్వం తరపున వారి జయంతి ఉత్సవాలు అధికారంగంగా నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు.సత్యసాయి శిష్యులు కొనసాగిస్తున్న సేవలు హర్షనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో రాయల్ సేవా సంస్థ అధ్యక్షులు అబ్దుల్ రాయల్ కరిముల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా భగవాన్ శ్రీ సత్యసాయి శత జయంతి

### సేవా సమితి కన్వీనర్ సాయినాథ్



**వేంపల్లె, మేజర్‌న్యూస్:** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్ కుంచా సాయినాథ్ వెల్లడించారు. ఆదివారం వేంపల్లె పురవీధుల్లో మంగళ వాయిద్యాలు, పాటల కోలాటంతో ఊరేగింపుగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్థానిక శ్రీషిర్డీసాయి బాబా మందిరంలో ఓంకారం, సుప్రభాతం, నగరస-కీర్తన, అభిషేకం తదితర విశేష పూజలు నిర్వహించామన్నారు. ఐదు రోజుల పాటు కొనసాగిన శత జయంతి వేడుకల్లో వివిధ సేవా కార్యక్రమాలతో పాటు విధ్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశామన్నారు.

## ఫించనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఏపి ఎన్జీవో ప్రొద్దుటూరు కార్య వర్గానికి సన్మానం



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో డిఎస్ నాఖరా హాల్‌లో కొత్తగ ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ స్టేట్ నాన్ గేజీటెడ్ అండ్ గేజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రొద్దుటూరు తాలూకా, ప్రెసిడెంట్ జె.రామ సుబ్బయ్య కార్యదర్శి ఈ.ప్రమీల, కోశాధికారి సి.సదాశివయ్య, కార్యవర్గ సభ్యులందరికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సభకు అధ్యక్షులుగా దస్తగిరిరెడ్డి వ్యవహరించగా విశిష్ఠ అతిధిగా తిరుపతి స్వామి సబ్ ట్రెజరీ అధికారి, ప్రొద్దుటూరు విచ్చేసి, సభలొ పెన్షనర్స్ అసోసియేషన్ గురించి ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్, గేజిటెడ్ వారి మెలకువలు, ఎలా మన సమస్యలు పరిపూర్ణం చేసుకోవాలి విషయం బాధ్యత మరియు హక్కులు గురించి, తెలిపారు. సభ పూర్తి అయిన తర్వాత విశిష్ఠ అధితి తిరుపతి స్వామిని, ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, ప్రొద్దుటూరు ప్రెసిడెంట్ రామసుబ్బయ్య యాదవ్, ప్రమీల, కార్యదర్శి, సదాశివ యాదవ్, కోశాధికారి మరియు కార్యవర్గ సభ్యులకు అందరికి శాలువా తో సన్మానించారు. ప్రార్థన గీతం గంగరాజు మాస్టర్ వారిచే గానంతో ప్రారంభమైంది.

## రక్తదానం చేయించిన మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగమ్మ అనే గర్భిణీ మహిళకు రక్తం తక్కువ ఉండటంతో ఓ పాజిటివ్ రక్తం అత్యవసరం కాగా వారు మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ ఫౌండర్ మోరే లక్ష్మణ్ రావుని సంప్రదించగా వారు వెంటనే స్పందించి ఫౌండేషన్ సభ్యుడు కిరణ్ చేత స్థానిక ప్రభుత్వ గవర్నమెంట్ హాస్పిటల్ నందు ఓ పాజిటివ్ రక్తదానం చేయించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఫౌండర్ మోరే లక్ష్మణ్ రావు, కృపా అగ్ని షారోన్ ట్రస్ట్ సుమన్ బాబు, ప్రసన్న కుమార్, పాపి శెట్టి వెంకట లక్షుమ్మ, మైఖేల్ బాబు, తదితరులు పాల్గొన్నారు. రక్త దాత అయినటువంటి కిరణ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## భవిత కేంద్రంలో మెడికల్ అసెస్మెంట్ క్యాంపు



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** స్థానిక హౌసింగ్ బోర్డులోని భవిత కేంద్రంలో మెడికల్ అసెస్మెంట్ క్యాంపుని సమగ్ర శిక్షా, విద్యా శాఖ వారు సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య సమన్వయ కర్త ఉమ్మడి రమణమూర్తి ఈ కార్యక్రమానికి అంధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ దివ్యంగులకు మెడికల్ అస్సేస్మెంట్ క్యాంపు అనేది ఒక మంచి అవకాశం అని, దివ్యంగులు తల్లితండ్రులు ప్రతి ఒక్కరు వీరి పట్ల ప్రేమభిమానాలు కలిగివుండాలని వారికీ సేవ చేసే భాగ్యం అందరికి రాదని, ఈ అవకాశాన్ని తెలిసిన వెంటనే మీ చుట్టూ పక్కల వారికీ తెలపాలని కొనియాడారు. ఈ సందర్భంగా ఐఈఆర్పీ సంగీత మాట్లాడుతూ తల్లితండ్రులు అందరు పిల్లల పురోగతి కి తొడ్పాడాలని, తల్లితండ్రులు దివ్యంగులను చులకన చేయొద్దని సూచించారు. అనంతరం ఆడియోలోజిస్ట్ మమతా బధిరులకు పరీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో అలింకో టీం, ఆడియోలోజిస్ట్, ఐఈడిఎస్ఎస్, ఐఈఆర్పీఎస్, భవిత సిజివిఎస్, ఏపిహెచ్ బి కాలనీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, దివ్యంగులు పేరెంట్స్ పాల్గొన్నారు.

## షేక్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ ముక్తియర్‌ను కలిసిన టిడిపి నాయకులు తాహిర్ హుస్సేన్



**దువ్వూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర షేక్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ ముక్తియార్ లను కలిసిన టిడిపి నాయకులు తాహిర్ హుస్సేన్ తదితరులు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షేక్ వెల్ఫేర్ బోర్డు సొసైటీ చైర్మన్‌గా ఎన్నికైన వి.ఎస్. ముక్తియార్‌ను ప్రొద్దుటూరులో ఆదివారం తన కార్యాలయంలో పూలమాల, దుశాల్వతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన తెలుగుదేశం పార్టీ సీనియర్ మైనార్టీ నాయకులు తాహిర్ హుస్సేన్ మరియు పార్లమెంట్ మైనార్టీ కార్యదర్శి అక్బర్ సలీం తదితరులు కలిశారు.

## ఈనెల 30న రైతు సదస్సు జయప్రదం చేయండి

### రైతు,వ్యవసాయ కార్మిక సంఘాలు

**పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్:** ఈనెల 30 న టేకూరుపేట లో పోరుమామిళ్ల పెద్ద చెరువు మునక ప్రాంత రైతు సదస్సు జయప్రదం చేయాలని రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. పోరుమామిళ్ల పెద్ద చెరువు మునక రైతాంగాన్ని ఆదుకోవాలని, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం తక్షణమే చెల్లించాలని ఈనెల 30వ తేదీన టేకూరుపేటలో జరిగే రైతు సదస్సు జయప్రదం చేయాలని టేకూరుపేటలో ఆదివారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతు , వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు దస్తగిరి రెడ్డి అన్వేష్ భైరవ ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ పోరుమామిళ్ల చెరువు నీటి కారణంగా ముంపుకు గురి అవుతున్న 10 గ్రామాలకు సంబంధించిన 1200 ఎకరాల పంట పొలాలను కృష్ణా జలాల ముంపు నుండి కాపాడాలని, అలా సాధ్యం కాని పక్షంలో 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు న్యాయమైన పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలనీ వారు డిమాండ్ చేశారు. పోరుమామిళ్ల చెరువు క్రింద పోరుమామిళ్ల మండలంలోని టేకూరు, టెకూరుపేట, తిరంగలాపురం, సూరుసిద్ది పల్లె, దాసరి పల్లె తిమ్మారెడ్డి పల్లె, కవల కుంట్ల, తోకల పల్లె, ఎర్రసాలా, కొర్రపాటి పల్లె తదితర గ్రామాలకు సంబంధించిన సుమారు 1200 ఎకరాల వ్యవసాయ పంట భూములు బ్రహ్మ సాగర్ జలాశయం నుండి వచ్చిన నీటితో అక్టోబర్ నెల చివరలో మునిగిపోయాయని వారు తెలిపారు. ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి వేల రూపాయలు ఖర్చు పెట్టి రైతులు సాగుచేసిన వరి, మొక్కజొన్న, సొద్ద, చిక్కుడు, కాకర, బీర, చౌల కాయలు వంటి కూరగాయల పంటలు పూర్తిగా మునిగిపోయాయి. ఒక్కొక్క రైతు ఎకరానికి సగటున 30 వేల రూపాయల నుండి 40 వేల రూపాయలు ఈ పంటలపై పెట్టుబడిగా పెట్టారని ఒక రూపాయి కూడా రైతుకు చేతికి రాలేదని తెలిపారు. బద్వేల్ చెరువు మరియు దిగువన ఉన్న ఇతర చెరువులకు నీళ్లు ఇచ్చేందుకు తెలుగు గంగ అధికారులు పోరుమామిళ్ల చెరువును సామర్థ్యానికి మించి నీరు నిల్వ చేయడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. 30వ తేదీన జరిగే సదస్సుకు ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ప్రభాకర్ రెడ్డి జిల్లా నాయకులు హాజరవుతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సంఘం నాయకులు చెర్లో పల్లె రైతు సంఘం నాయకులు రాజారెడ్డి నాగిరెడ్డి అబ్బిరెడ్డి రమేష్ రెడ్డి స్థానిక మండల రైతు సంఘం నాయకులు వీరభద్ర , రాజు తదితరులు పాల్గొన్నారు

## కొప్పరపు వెంకటసుబ్బమ్మ భౌతికాయానికి పూలమాలవేసి నివాళులు



**బద్వేల్, మేజర్‌న్యూస్:** బద్వేల్ పట్టణానికి చెందిన ఆర్యవైశ్య వర్తక సంఘం మాజీ అధ్యక్షుడు కే.వి.సుబ్బారావు మేనత్త వెంకటసుబ్బమ్మ మరణించిన వార్త తెలిసిన వెంటనే టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ రితేష్ రెడ్డి ఆమె బతకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను వారు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు ఆయన వెంట ఆర్యవైశ్య ప్రముఖులు కనుమర్లపూటి ప్రసాద్ సింగ%శీ% పల్లె శివయ్య స్వామి పలువురు నాయకులు పలువురు ఆమె బోతకాయనికి పాల్గొని నివాళులర్పించి పూలమాల లేసి సంతాపం తెలిపారు.

## అన్నదాతలు క్రాప్ హాలిడే ప్రకటించుటకు సిద్ధంగా ఉన్నారు

### మాజీ ప్రభుత్వ సలహాదారులు పోతిరెడ్డి నాగార్జురెడ్డి



**పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్:** గత ప్రభుత్వంలో రైతుల పరిస్థితి ఎలా ఉండేది ఈ ప్రభుత్వంలో ఎలా ఉంది అనే వాస్తవ విషయాలను తెలియజేస్తున్నానని మాజీ ప్రభుత్వ సలహాదారుడు నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. స్వాతంత్రం వచ్చిన తరువాత రైతుల పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నడూ ఈ విధంగా లేదని రైతులు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధరలు లేవని పొగాకు, వరి, పత్తి, మిర్చి,టమోటో,మొక్కజొన్న, అరటి,కొబ్బరి, వేరుసెనగ, నిమ్మ,మామిడి,చెరుకు, బొప్పాయి,పసుపు పంటలకు ఈ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లో రైతులకు గిట్టుబాటు ధరలు లేవని ఎరువుల కొరత ఏర్పడిందని తెలిపారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు అన్నదాత సుఖీభవ ద్వారా ప్రతి సంవత్సరం ఒకేసారి రైతుల అకౌంట్లో ప్రతి రైతుకు 20,000 వేస్తానని చెప్పడం జరిగిందన్నారు. మొదటి సంవత్సరం వెయ్యకుండా ఎగనామం పెట్టారని రెండవ సంవత్సరం కేవలం 5000 మాత్రమే వేశారని ఏడు లక్షల మంది రైతులకు ఎగనామం పెట్టారని తెలిపారు. జగనన్న ప్రభుత్వంలో ఇన్పుట్ సబ్సిడీ ఉచిత భీమా పథకాన్ని ప్రభుత్వమే రైతుల తరపున కట్టడం జరిగింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు. ఎరువులు. మందులు రైతులు పండించిన పంటలను గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేయడం జరిగిందని, ప్రస్తుతం ఈ ప్రభుత్వం గాలికి వదిలి వేయడం జరిగిందన్నారు. 2014 నుండి 2019 లో 1,75.లక్షల ఎకరాలు సాగు లో ఉండేదని 45 వేల టన్నులు ఎగుమతులు జరిగేవని,2019 నుండి 2024 వరకు వైయస్ జగన్ రైతులకు ఇచ్చిన ప్రోత్సాహకాలు వల్ల అరటి 2.74 వేల ఎకరాలకు పెరిగాయని 3 లక్షల టన్నులు ఎగుమతులు జరిగాయని తెలిపారు.ప్రతి సంవత్సరం 2018, 2019 లో తెలుగుదేశం ప్రభుత్వంలో ఒకటన్న 5000 రూపాయలకు మించలేదు. 2020 నుండి 2022 సంవత్సరంకు ది బెస్ట్ స్టేట్ ఇన్ బనానా అవార్డు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చింది గుర్తు చేశారు. రైతే రాజు రైతే దేశానికి వెన్నెముక అని ఒకప్పటి మాట. నేడు రైతు వెన్నెముక విరిగింది. రైతులు అప్పులు పెరిగి ఆత్మహత్యలు పెరిగాయని గతంలో తొమ్మిది సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు వ్యవసాయం దండగ అని చెప్పడం జరిగిందని వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రైతు రుణమాఫీ,ఉచిత విద్యుత్ ఇవ్వడం, ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేయడం వల్ల వ్యవసాయం పండుగలు చేశారని నాగార్జున రెడ్డి పేర్కొన్నారు.

## నూతనవిగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి రావాలంటూ ఎంపీ అవినాష్ రెడ్డికి ఆహ్వానం



**గోపవరం, మేజర్‌న్యూస్:** బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని తెలుగు గంగ కాలనీ లో నూతనంగా నిర్మించిన రామాలయం ప్రతిష్ట కార్యక్రమానికి రావాలంటూ కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి రావాలని ప్రత్యేకంగా ఆహ్వానించి ఆహ్వాన పత్రిక అందచేసి ననూతన రామాలయ కమిటీ సభ్యులు పులివెందులకు వెళ్లి ఆయన స్వగృహమునందు ఆదివారం బద్వేలుపట్టణానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు వెళ్లి ఆయనకు అందజేశారు. అవినాష్ రెడ్డి స్పందిస్తూ ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరై దేవస్థానాన్ని సందర్శిస్తారని ఆయన తెలిపినట్టు వారు తెలిపారు. ఆహ్వానం బలిగిన వారిలో వైసీపీ నాయకుడు వంకేలపోలిరెడ్డి పలువురు పాల్గొన్నారు.

# మానవ సేవే మాధవ సేవ



కడప క్రైమ్ మేజర్‌న్యూస్ : కడప జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య శ్రీ సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయిబాబా సేవా సంస్థ ను ఏర్పాటుచేసి ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. ప్రపంచ స్థాయి విద్యను ఒక రూపాయి ఖర్చు లేకుండా అందించడం జరుగుతుందని తెలిపారు. ఉన్నత స్థాయి వైద్య పరికరాలతో ప్రజలకు వైద్యాన్ని అందిస్తూ ఎల్లప్పుడూ సమాజ సంక్షేమం కోసం పనిచేశారని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ఆర్.ఎస్.ఐ లు వెంకటేశ్వర్లు, రామస్వామిరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కల్తీ మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు

### పంచాయతీ ఇఓ నాగభూషణం రెడ్డి



**వేంపల్లె మేజర్‌న్యూస్:** కల్తీ మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక పంచాయతీ ఇఓ నాగభూషణం రెడ్డి హెచ్చరించారు. ఆదివారం మాంసం విక్రయ కేంద్రాలపై తనిఖీ నిర్వహించారు. అనంతరం మృతి చెందిన 8 గొర్రెలను గుర్తించి, వీటిని దహనం చేశారు. అలాగే ఫ్రిజ్ లో దాచి ఉంచిన, చెడిపోయి ఉన్న మాంసాన్ని కాల్చివేశారు. ఈ సందర్భంగా ఇఓ మాట్లాడుతూ ఏవైనా అనుమానస్పదమైన కల్తీ మాంసం విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలని, వీటిపై తక్షణమే చర్యలు తీసుకుంటామని కొనుగోలు దారులకు విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆప్ నేత రహంతుల్లా, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జనసేన కమిటీ, మార్పుల ప్రక్రియపై హర్షం

### డా.దాసరి రవిశంకర్



**వేంపల్లె మేజర్‌న్యూస్:** జనసేన పార్టీ కమిటీల నియామకం, మార్పుల ప్రక్రియపై ఆ పార్టీ నేత డా.దాసరి రవిశంకర్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ అధినేత డీసిఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రూపొందిస్తున్న నూతన కమిటీల నియామకంతో పార్టీ బలోపేతానికి, పటిష్టతకు మరింత బాధ్యత కలిగిస్తుందన్నారు. కార్యకర్తల మనోభావాలను దృష్టిపెట్టి దీనికి అణుగుణంగా నడుచుకోవాలన్న అధినేత ఆదేశాలు మరింత ఉత్సాహాన్ని కల్పిస్తోందన్నారు. కడప జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించి కమిటీ వేయడం ద్వారా పార్టీ పటిష్టంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

# ఏం కొనలేం... ఏం తినలేం

## కొండెక్కిన కూరగాయల ధరలు కొనలేక ప్రజల అవస్థలు

**కడప క్రైమ్ మేజర్‌న్యూస్:** కడప నగరంలోని రైతు మార్కెట్లో కూరగాయల ధరలు అమాంతం మండిపోతున్నాయి. సామాన్యులు అధిక ధర పెట్టి కొనలేక అవస్థలు పడుతున్నారు. 500 రూపాయలు వెచ్చించిన వారానికి సరిపడా కూరగాయలు రావడంలేదని వాపోతున్నారు. కిలోకు అమాంతంగా 30 రూపాయలు నుంచి 60 రూపాయలు మేర ధర పెరగడంతో భారంగా మారింది. అధిక ధరలు చెల్లించిన నాణ్యమైన సరుకు రైతు బజార్లో దొరకడం లేదని, టమోటా కిలోకు 40 రూపాయలు ధర చెల్లించిన నాణ్యమైన టమోటో దొరకడం లేదని ప్రజల గగ్గోలు పెడుతున్నారు. కుళ్ళిపోయిన సరుకును రైతు బజార్లలో అమ్ముతున్న వాటి ధరలు మాత్రం అక్కడి అధికారులు నాణ్యమైన సరుకు మాదిరిగా ధరలు బోర్డు మీద వేయడంతో వ్యాపారులు గల్లా పెట్టలు నింపుకుంటున్నారు. కొనుగోలుదారులు జేబి లు చిల్లులు పడుతున్నాయి. జిల్లాలో కూరగాయలు అధికంగా పండించే ప్రాంతాలలో పంటలు ఇటీవల తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్నాయి. పూత, పిందెలు కుళ్ళి పాడయ్యాయి. పంట



దిగుబడి తగ్గి మార్కెట్లో డిమాండ్ పెరగడంతో ధరలు విపరీతంగా పెరిగాయని వ్యాపారాలు చెబుతున్నారు.

# నేడు సభాభవన్ లో పీజీఆర్ఎస్ నిర్వహణ : డీఆర్వో విశ్వేశ్వర నాయుడు

కడప ప్రతినిధి - మేజర్‌న్యూస్ : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నెంబర్ కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని డిఆర్వో కోరారు.

**సభాభవన్ లో పిజిఆర్ఎస్ నిర్వహణ...**

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సోమవారం సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వరనాయుడు తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చును. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారు.

**డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం**

డయల్‌యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు జరుగుతుందన్నారు. ప్రజలు 08562-244437 ల్యాండ్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# శ్రీ కోదండరాముడి సేవలో సత్య సాయినాథ్ శర్మ కుటుంబం

## రైతుల సంక్షేమం, ప్రజల కోసం ఆలయంలో ప్రత్యేక పూజలు - స్వామివారి ఆశీస్సులు కోరిన వైసీపీ రాష్ట్ర ఎస్ఈసి సభ్యుడు



**కడప మేజర్‌న్యూస్ :** ఒంటిమిట్టలోని ప్రతిష్ఠాత్మకమైన శ్రీ కోదండరామ స్వామి దేవస్థానములో కుటుంబ సమేతంగా రాముని దర్శించుకున్న రాష్ట్ర వైసిపి ఎస్ఈసి సభ్యులు కాశిభట్ల సత్య సాయినాథ్ శర్మ, దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఈ పురాతన ఆలయ మహిమను స్మరించారు, ఆలయ ప్రాంగణానికి చేరుకున్న సాయినాథ్ శర్మ కుటుంబాన్ని ఆలయ అర్చకులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, ప్రత్యేక పూజా ఏర్పాట్లు చేశారు, కుటుంబ సభ్యులందరూ కలిసి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు, ఈ సందర్భాన్ని పురస్కరించుకుని స్వయంగా ఆలయ చరిత్రను స్మరించుకున్న సాయినాథ్ శర్మ మాట్లాడుతూ ఈ పవిత్రక్షేత్రంలో శ్రీ కోదండరాముడిని దర్శించుకోవడం ఎంతో పుణ్యకార్యం అన్నారు, ఇక్కడ శాంతి, సౌమ్య వాతావరణం మనసుకు ఆహ్లాదాన్ని పంచుతుందని మన రాష్ట్రంలో ఈ దేవాలయం రామభక్తికి అద్దం పట్టే ఆలయం అని పేర్కొన్నారు, ప్రజలందరి మీద స్వామివారి కటాక్షం ఎప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను, పాడిపంటలు పుష్కలంగా పండాలని, రైతులు సుఖసంతోషాలతో జీవించాలని, రాష్ట్ర ప్రజలకు మంచి జరిగి అందరూ బాగుండేటట్లు చూడాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు, దర్శన అనంతరం సాయినాథ్ శర్మ కుటుంబ సభ్యులు స్వామివారి సేవలను ఆస్వాదించి, ఆలయ ప్రాంగణంలో కొంతసేపు గడిపారు, ఆలయ అధికారులు, భక్తులు వారిని ఆత్మీయంగా పలకరించారు



# రైతన్న నీకోసంపై అధికారులకు అవగాహన సదస్సు

## మండల ప్రత్యేక అధికారి ఇదాయతుల్లా - ఎంపీడీవో సుబ్బారెడ్డి

దువ్వూరు, మేజర్‌న్యూస్ : దువ్వూరు ఎంపీడీవో కార్యాలయంలోని సభ భవనంలో సత్య సాయి బాబా జన్మదిన సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన మండల ప్రత్యేక అధికారి ఇ దాయతుల్లా ఎంపీడీవో సుబ్బారెడ్డి తాహసిల్దార్ సంజీవరెడ్డితదితరులు. అనంతరం అగ్రికల్చర్ మరియు సంబంధిత శాఖల ఆధ్వర్యంలో రైతన్న నీకోసం అనే పథకము రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 24వ తేదీనుండి డిసెంబర్ 3వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి రైతులు ప్రభుత్వం పై లబ్ధి పొందుతున్న రాయితీలు మరియు ప్రభుత్వం వ్యవసాయ రంగానికి కల్పిస్తున్న ఉపయోగాలపైన సచివాలయ సిబ్బంది కి అవగాహన కల్పించడం జరిగింది. సచివాలయ సిబ్బంది మండలంలోని రైతులకు ప్రభుత్వం సూచించిన సలహాలు ఈనెల 24వ తేదీనుండి డిసెంబర్ 3వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తారుఅని వారు తెలిపారు. కార్యక్రమంలో మండల అధికారులు, వ్యవసాయ శాఖ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## జనసేన పార్టీ క్రియా ఇన్సూరెన్స్ చెక్కుల పంపిణీ

### జనసేన నాయకులు పాశం లక్ష్మీ నరసయ్య



**దువ్వూరు, మేజర్‌న్యూస్ :** దువ్వూరు మండలం జిల్లెళ్ళ గ్రామంలోనీ దూదేకుల హుస్సేన్ బాషా కుటుంబానికి జనసేన పార్టీ తరపున 5 లక్షలు ఆర్థిక సాయం అందజేసినట్టు మైదుకూరు అందజేసినట్టు నియోజకవర్గం జనసేన నాయకులు పాశం లక్ష్మీ నరసయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ ఆదివారం లక్ష్మీనరసయ్యతాడేపల్లి అన్నపూర్ణ కన్వెన్షన్ హాల్ నందు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి శాసనమండలి సభ్యులు నాగేంద్రబాబు చేతులమీదుగా ప్రమాదవశాత్తు చనిపోయిన హుస్సేన్ బాషా కుటుంబానికి చెక్ ను అందజేసినట్లు తెలిపారు.దూదేకుల హుస్సేన్ బాషా జనసేనపార్టీ కార్యకర్తగా పార్టీ సభ్యత్వం తీసుకుని ఉన్నందున ఆయన ఆకస్మిక మరణం వల్ల జనసేన పార్టీ తరపున ఆర్థిక సాయంగా 5లక్షలు వారి కుటుంబానికి మంజూరు చేశారని తెలిపారు. హుస్సేన్ బాషా తల్లిగారు ఓబులమ్మ మాట్లాడుతూ మా కుటుంబానికి జనసేన పార్టీ తరపున ఆర్థిక సాయం అందించిన పవన్ కళ్యాణ్ రుణం తీర్చుకోలేనిది అని అన్నారు. పార్టీకి ఎప్పుడు మా మద్దతు ఉంటుంది అని మాకు ఈ సహాయం రావడానికి కృషి చేసిన మైదుకూరు నియోజక వర్గం నాయకులు పాశం లక్ష్మీ నరసయ్య కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాతంశెట్టి నాగేంద్ర, దీటి హరిక్రిష్ణ పలువురు నాయకులు, జనసేన మంగళగిరి పార్టీ ఆఫీస్ సభ్యులు పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ



**పోరుమామిళ్ల మేజర్‌న్యూస్ :** పోరుమామిళ్ల పట్టణం వెంగమాంబ నగర్‌లో శ్రీ కోనంకి వెంకట నాయుడు, శ్రీమతి కృష్ణకుమారి కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా నిర్వహించిన నూతన గృహప్రవేశం మరియు సత్యనారాయణ స్వామి వ్రత మహెూత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని దంపతులను ఆశీర్వదించారు. కొత్త జీవితంలో సుభిక్షం, శాంతి, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో రంగసముద్రం పంచాయతీ సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, జిల్లా అనుబంధం విభాగాల నాయకులు నాగసుబ్బారెడ్డి, రాజారెడ్డి, పార్టీ నాయకులు గంటా రమణారెడ్డి, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కడపలో చెకుముకి సైన్స్ సంబరాల సందడి

### ప్రభుత్వ - ప్రైవేట్ పాఠశాలల 37 టీంల శాస్త్ర ప్రతిభ ప్రదర్శన



**కడప మేజర్‌న్యూస్ :** జిల్లాలోని ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీలో ఆదివారం జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఘనంగా నిర్వహించారు, కార్యక్రమాన్ని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జన విజ్ఞాన వేదిక సలహాదారులు కృష్ణారెడ్డి, జెవివి రాష్ట్ర నాయకులు రాజశేఖర్ రాహుల్, కాలేజ్ ప్రిన్సిపాల్ సుదర్శన్ రెడ్డి కలిసి ప్రారంభించారు, ఈ శాస్త్రోత్సవంలో ప్రభుత్వ పాఠశాలల నుండి 21 టీములు, ప్రైవేట్ పాఠశాలల నుండి 16 టీములు పాల్గొని తమ శాస్త్ర ప్రతిభను ప్రదర్శించాయి, రాష్ట్రవ్యాప్తంగా శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, మూఢనమ్మకాల నిర్మూలన, విజ్ఞాన భావజాలాన్ని ప్రజల్లో విస్తరించడం లక్ష్యంగా జన విజ్ఞాన వేదిక చేపడుతున్న కార్యక్రమాల్లో చెకుముకి కీలకంగా నిలుస్తోంది, విద్యార్థుల్లో పరిశోధనాత్మక భావన, శాస్త్రీయ ఆలోచనలను రేకెత్తించేందుకు జెవివి పాఠశాలల నుండి గ్రామాల వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శులు సమీర్ బాష, శివరాం, జిల్లా కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఈ సైన్స్ సంబరాలు విజయవంతంగా ముగిశాయి.

## రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇవ్వకుండా మోసగించిన ప్రధాని మోదీ

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి

**ఖాజీపేట మేజర్‌న్యూస్ :** బీజేపీ రాష్ట్రానికి శనిగ్రహమైతే, వైకాపా, టిడిపిలు రాహు, కేతువుల్లా దాపురించాయని కాంగ్రెస్ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి విమర్శించారు.ఆదివారం ఖాజీపేటలో మీడియాతో మాట్లాడుతూ, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రత్యేక హెూదా పేరుతో ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసం చేసిందని తీవ్రంగా అభిప్రాయపడ్డారు. విభజన చట్టం ప్రకారం రాయలసీమ, ఉత్తరాంధ్రలకు బుందేల్‌ఖండ్ తరహా అభివృద్ధి ప్యాకేజీ నిధులు ఇవ్వాల్సి ఉన్నా ఇవ్వలేదని అన్నారు. కడప జిల్లాలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలన్న హామీ కూడా అమలు కాలేదని పేర్కొన్నారు.వైకాపా పాలనలో రాష్ట్రం అప్పుల, అవినీతి, మద్యం, డ్రగ్స్, గంజాయి కేంద్రంగా మారిపోయిందని తెలిపారు. ప్రజలు విసిగి వేసారిన తర్వాతే ప్రభుత్వ మార్పు జరిగిందని వ్యాఖ్యానించారు. అయితే ప్రస్తుత చంద్రబాబు నాయకత్వంలోని కూటమి పాలన మరింత అధ్వాన్నంగా మారిందని అన్నారు.కేవలం 17 నెలల్లోనే 1.22 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసి, రాష్ట్రాన్ని అప్పుల మయంలోకి నెట్టేసిందని ఆరోపించారు. అప్పుల విషయంలో చంద్రబాబు ప్రభుత్వానికి "ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చు" అని ఎద్దేవా చేశారు.విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో 15,485 కోట్ల రూపాయల అదనపు భారాన్ని వినియోగదారులపై మోపారని, ఒక మండలంలో నాలుగు మద్యం దుకాణాల స్థానంలో 40 బెల్ట్‌షాప్‌ల స్థాయిలో మద్యం ప్రవాహం సాగుతోందని తెలిపారు. మూడు జోకర్లు, ఆరు కళావరాలుగా జూదం నడుస్తోందని, పాఠశాలల్లో డ్రగ్స్, గంజాయి దుష్ప్రభావం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని, ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదని అన్నారు. ప్రభుత్వం నిమ్మకునీరు ఎత్తినట్లుగా మౌనం వహిస్తోందని వ్యాఖ్యానించారు. ఇంతకైనా ప్రభుత్వం మాటలు తగ్గించి చర్యలు పెంచి రైతులను, ప్రజలను ఆదుకోవాలని తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు.సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డాక్టర్ ఫయాజ్, జీవీ రమణ, ఇస్మాయిల్, ఖలీల్, జిలాని, మహబూబ్ బాషా, సత్తార్, అమర్నాథరెడ్డి, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, ఐచర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

### డీఎల్‌తో తులసిరెడ్డి భేటీ

ఖాజీపేట నాగనాదేశ్వర కోన వద్ద జరిగిన వివాహానికి హాజరైన తులసిరెడ్డి, అనంతరం మాజీ మంత్రి, సీనియర్ నేత డీఎల్ రవీంద్రారెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా, దేశ రాజకీయాలపై ఇద్దరూ చర్చించుకున్నారు. గత వైకాపా ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రెండూ ప్రజలకు నిరాశ కలిగించాయని అభిప్రాయపడ్డారు





## బీజేపీ ప్రొద్దుటూరు రూరల్ మండలం అధ్యక్షుని నియామకం



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకటసుబ్బారెడ్డి ఆదేశాల మేరకు బిజేపి కడప జిల్లా జనరల్ సెక్రటరీ, నూతనంగా ప్రొద్దటూరు, జమలమడుగు, పులివెందుల, ఇంచార్జ్ బాధ్యత అందుకున్న కోనేటి కృష్ణ ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నూతన రూరల్ కమిటీ అధ్యక్షుడిగా గోపిరెడ్డి మురళి రెడ్డిని, కమిటీ మెంబర్లను ఎన్నుకున్నారు..ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కో కన్వీనర్ గౌరీ శంకర్ ,1 వ పట్టణ అధ్యక్షుడు నరేంద్ర, 2 వ పట్టణ అధ్యక్షుడు పాలెం కిరణ్ కుమార్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ గురు ప్రసాద్, జిల్లా ఎక్సక్యూటివ్ మెంబర్ రవి శంకర్, అగస్తేశ్వర ఆలయ కమిటీ మెంబర్ విక్రాంత్, కడప జిల్లా సెక్రటరీ జయలక్ష్మి, కడప జిల్లా ఎక్సక్యూటివ్ మెంబర్ కొండయ్య, బిజేవైఎం పట్టణ అధ్యక్షుడు వరప్రసాద్, బోరెడ్డి సుధాకర్ నూతన కమిటీ మెంబర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా నియమించిన రూరల్ మండల అధ్యక్షుడు మురళి కృష్ణారెడ్డి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ రూరల్ మండలంలో మరింత బలోపేతం అయ్యేటట్లు కృషి చేస్తానని దానికి కార్యకర్తలందరూ సహకరించి పార్టీ అభివృద్ధికి దోహదపడాలని కోరారు.

## ఏపీ షేక్ సంక్షేమ, అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వి.యస్.ముక్తియార్‌కు సన్మానం

**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** ప్రొద్దుటూరు పురపాలక ఇన్చార్జ్ ఛైర్మన్‌గా, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా, ప్రొద్దుటూరు అంజుమన్ అహలే ఇస్లాం కమిటీ అధ్యక్షులుగా, ముక్తియార్ విద్యాసంస్థల అధినేతగా వివిధ విభాగాల్లో తన సేవలు అందిస్తూ నియోజకవర్గంలోని ప్రతి ఒక్క టిడిపి నాయకునికి, కార్యకర్తకు అందుబాటులో వుండి అందరినీ తన ఆత్మీయులుగా భావిస్తూ కులమతాలకు అతీతంగా ప్రజలందరి ప్రేమాభిమానాలు చూరగొని తెలుగుదేశంపార్టీ విజయాలకు వి.యస్.ముక్తియార్ టిడిపి పార్టీకి చేసిన ఎనలేని కృషిని గుర్తించిన అధిష్టానం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షేక్ సంక్షేమ మరియు అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా నియమించిన సందర్భంగా ఆదివారం నందమూరి యువసేవాసమితి ఆధ్వర్యంలో ఆయనను ముస్లిం సాంప్రదాయ పద్ధతిలో సన్మానించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి.గుర్రప్పయాదవ్, టీడీపీ కడప పార్లమెంటరీ మైనారిటీ సెల్ కార్యనిర్వహక కార్యదర్శి టప్పా మహబూబ్ బాష, కడప పార్లమెంటరీ తెలుగుయువత కార్యనిర్వహక కార్యదర్శి కూనపురిరామునాయుడు, నందమూరి యువసేవాసమితి అధ్యక్షుడు గోమేధికమ్ సుదర్శన్, ఉపాధ్యక్షుడు సిజె.వెంకటసుబ్బయ్య, కార్యదర్శి రహంతుల్లా, మేస్త్రి బాష పాల్గొన్నారు.



## మానవత సేవలు విస్తరించడమే లక్ష్యం

### అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి



**చెన్నూరు మేజర్‌న్యూస్ :** మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు గ్రామ గ్రామాన విస్తరించాలని తమ లక్ష్యమని అందుకోసమే ప్రతి నెలా జరిగే సమావేశాన్ని గ్రామ పంచాయతీలలో నిర్వహించడం జరుగుతోందని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల అధ్యక్షుడు లేవాకు వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. నెలవారీ సమావేశాలలో భాగంగా ఆదివారం మండలంలోని రామనపల్లె గ్రామంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా సంస్థ తరపున ప్రతి ఒక్కరికీ సేవ చేసే గుణం కలగాలని పేదలకు ఉపయోగపడేందుకే ఇలాంటి సేవా సంస్థలు ఉన్నాయన్నారు. మన మండలంలో 7 ఫ్రీజర్ బాక్సులు, 2 వ్యాన్లు, ఒకటి శాంతి రథం, ఒకటి సుమో ఉందని ఎవరికి అవసరమైనా పంపేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మానవత సభ్యులలో ఎవరికైనా అనారోగ్యం కానీ ఇతర ఏ కారణం చేతనైనా ఆర్థిక ఇబ్బందులు కలిగినా వారిని ఆదుకునేందుకు సేవా సంస్థ ముందుంటుందన్నారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలుతుంటాయని వైద్య శిబిరాలు నిర్వహించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అనంతరం శాలువాతో అధ్యక్షుడిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనరల్ కమిటీ డైరెక్టర్ రామాంజులరెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, రామన శ్రీలక్ష్మి, మాజీ ఎంపీటీసీ కృష్ణారెడ్డి, వెంకటసుబ్బయ్య, శివరామకృష్ణ, వేణుగోపాల్ రెడ్డి, నీలం శ్రీనివాసులు రెడ్డి, భూమిరెడ్డి పవన్ కుమార్ రెడ్డి (పండు) గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పాత బస్టాండ్ యాదాళ్ల పిచ్చయ్య చారిటీ స్థలంలో అనుమతిలేని వ్యాపార సముదాయం పనులు ఆపాలి

### కోట్ల విలువైన జడ్‌పి స్థలాల్లో వ్యాపార సముదాయ నిర్మాణాల పేరుతో అధికార పార్టీ నేతల ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు : గాలి చంద్ర - సిపిఐ జిల్లా కార్యదర్శి




**కడప సిటీ మేజర్‌న్యూస్ :** సిటి ప్లానింగ్ అనుమతి లేకుండా పాత బస్టాండ్ వద్ద యాదాళ్ల పిచ్చయ్య చారిటీ స్థలంలో నిర్మిస్తున్న వ్యాపార సముదాయం పనులు ఆపాలి అని ఆదివారం సిపిఐ ప్రతినిధి బృందం పరిశీలనలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. సదరు స్థలం పై 48లక్షల పన్ను బకాయిలు ఉన్నాయని కడప నగరపాలక సంస్థ ఇచ్చిన నోటీసుపై చారిటీ తరపున న్యాయస్థానాన్ని ఆశ్రయించి చారిటీ తరపున ధార్మిక సేవా కార్యక్రమాలు చేస్తున్నాము కాబట్టి పన్నులపై ఇచ్చిన నోటీసులు తదుపరి చర్యలు తీసుకోకుండా నిలుపుదల చేయాలని ఇచ్చిన ఉపశమనాన్ని అడ్డం పెట్టుకొని ప్లానింగ్ అనుమతి లేకుండా వ్యాపార సముదాయాల నిర్మాణం చేపట్టి మొత్తం స్థలం రెండు భాగాలుగా విభజించి అధికార పార్టీ నేతలకు లీజు పేరుతో కట్టబెట్టి వారు రూములుగా విభజించి లక్షల అడ్వాన్స్ వేలల్లో బాడుగకు ఇవ్వడం వెనక లోపాయికారి ఒప్పందాలు దాగి ఉన్నాయి అన్నారు. చారిటీ ట్రస్ట్ బైలా లో వ్యాపార సముదాయాల నిర్మాణం చేసేందుకు తీర్మానం, రిజిస్ట్రేషన్, ఎండోమెంట్ అనుమతి తీసుకున్నదా అని ప్రశ్నించారు. రాజు తలచుకుంటే కొరడా దెబ్బలకు కొదవా అన్నట్లు అధికార పార్టీ నేతల వత్తిళ్ళకు తలొగ్గి అన్ని విభాగాలు కలిసి అనుమతి లేని నిర్మాణాలపై స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సబబు కాదన్నారు. నిత్యం రద్దీగా ఉన్న పాత బస్టాండ్ వద్ద ప్రస్తుతం నిర్మిస్తున్న వ్యాపార సముదాయాలు ఫైర్ సెఫ్టీ, సెట్ బ్యాక్, పార్కింగ్ ప్రమాణాలు పాటించకపోవడం భవిష్యత్ లో ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉన్నది అన్నారు. యాదాళ్ల పిచ్చయ్య ట్రస్టు స్థలాలు, జెడ్ పీ స్థలాలు వ్యాపార సముదాయాల నిర్మాణం లో అధికారపార్టీ నేతలు ఉండడం, కడప నగరపాలక సంస్థ కు చెందిన మీ సేవ భవనం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు వస్తున్న వార్తలు, ఏర్పాటుకు పాలక వర్గం అనుమతి లేకుండా తీసుకోవడం నగరంలో విలువైన స్థలాలు అధికార పార్టీ ఆదాయ వనరులుగా మార్చుకోవడాన్ని సిపిఐ వ్యతిరేకిస్తున్నది అన్నారు. అనుమతి లేకుండా నిర్మిస్తున్న వ్యాపార సముదాయాల నిర్మాణం ఆపే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి ఎన్ వెంకట శివ జిల్లా కార్యవర్గ సభ్యులు జి వేణుగోపాల్, కే సి బాదుల్లా, సహాయ కార్యదర్శి బి శంకర్ నాయక్, కే మునయ్య, భాగ్యలక్ష్మి, లింగన్న గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## చెన్నూరు జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

### మహిళకు తీవ్ర గాయాలు

**చెన్నూరు మేజర్‌న్యూస్:** మండలంలోని చెన్నూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కడప-కర్నూలు జాతీయ రహదారి బుడ్డాయపల్లి క్రాస్ వద్ద శనివారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రాత్రి 10.45 గంటల ప్రాంతంలో రహదారి దాటుతున్న ఎర్రమల తులసమ్మ (56)ను కడప నుండి విజయవాడకు వెళ్తున్న ఏఆర్01 6363 నెంబర్ గల బీసీవీఆర్ ట్రావెల్స్ బస్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తులసమ్మ తలకు తీవ్ర రక్త గాయాలు కావడంతో వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆమెను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. గాయపడిన తులసమ్మ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

## భవిష్యత్ కార్యాచరణతో ముందుకెళ్తాం

### నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు జయరాజు




**కడప టౌన్, మేజర్‌న్యూస్ :** నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పిలుపు మేరకు నగరంలో ఆదివారం కడప జిల్లా అధ్యక్షులు గుడిమే జయరాజు ఆధ్వర్యంలో నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ 11వ వార్షికోత్సవం కార్యకర్తలు, ఆఫీస్ బేరర్ల సమక్షంలో కేకును కట్ చేసి జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ వాడవాడలలో ప్రతి మాదిగ వార్షికోత్సవ వేడుకలు జరుపుకోవాలని అవసరం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో.. అన్ని నియోజకవర్గాలలో నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ 11వ వార్షికోత్సవ ఉత్సవాలు జరుపుకుంటున్నారని తెలిపారు. తదుపరి ముందుకు వెళ్లాల్సిన కార్యాచరణ గురించి రాష్ట్రవ్యవస్థాపక అధ్యక్షులు పరిషపోగు శ్రీనివాసులు దిశానిర్దేశం చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం మన ముందున్నటువంటి కర్తవ్యం ప్రతి మాదిగ కుటుంబానికి సంక్షేమం, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత పెద్దలపై ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకులు గుండ్లపల్లి గరుడాద్రి, జిల్లా ఉపాధ్యక్షులు ఓబులేష్, సెక్రటరీ వీరసుబ్బరాయుడు మాదిగ, న్యాయవాది చలపతి మాదిగ, ఇంకా పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. అందుకు పాల్గొన్న ప్రతిఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## ఆర్డీవో కార్యాలయంలో సత్యసాయి బాబా జయంతి వేడుకలు

### బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి కేకు కట్ చేసిన అధికారులు




**బద్వేల్ మేజర్‌న్యూస్ :** బద్వేల్ పట్టణంలోని స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయము నందు ప రాష్ట్ర ప్రభుత్వం శ్రీ భగవాన్ సత్యసాయి బాబా 100వ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని ఆదేశాను సారం శ్రీ భగవాన్ సత్య సాయిబాబా శత జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ మున్సిపల్ కమిషనర్ నరసింహ రెడ్డి బద్వేల్ గోపవరం రెవెన్యూ అధికారులు భాస్కర్ రాజు త్రిబువన్ రెడ్డి అర్బన్ రూరల్ సిఐలు లింగప్ప కృష్ణయ్య ఆధ్వర్యంలో శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యాలయము నందు సత్య సాయి బాబా చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసిన అనంతరం సాయి సేవా సమితి వారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపించి సాంప్రదాయ పద్ధతిలో డివిజన్ పరిధిలోని అధికారులు వస్త్రాలు ధరించి సాయి కీర్తనలు పటిస్తూ భక్తిశ్రద్ధలతో శ్రీ సత్య సాయి బాబా జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం అనంతరం ప్రత్యేకంగా సత్య సాయి బాబా జన్మదిన వేడుకలకు సంబంధించి కేకును తయారు చేయించి అధికారులు కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ భగవాన్ సత్య సాయి బాబా ఆత్మహత్యకంగా పలు ప్రజలకు మార్గదర్శకాలు చూపిస్తూ అదేవిధంగా నిరుపేదలైనటువంటి విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించకుండా ఇబ్బందుల గురవుతున్న తరుణంలో ఉచితంగా కార్పొరేట్ స్థాయిలో విద్యను అందజేశారని సామాన్యులు ఎవరైనా అనారోగ్య పారిన పడినచో లక్షలాది రూపాయలు వేచించి ఆరోగ్యం చేయించుకోలేని పేద ప్రజలకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేసి అన్ని వ్యాధులకు ఉచితంగా వైద్యం చేయించారన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో పయనించి సాటి మనుషులు ఇబ్బందుల్లో ఉంటే వారికి సేవాదృపతముతో సహాయం చేయాలని తెలిపారు. బద్వేల్ డివిజన్లోని డివిజనల్ స్థాయి శాఖ అధికారులు, ఆర్‌డిఓ కార్యాలయ సిబ్బంది హాజరయ్యారు.

## రైతుల అభ్యున్నతికే రైతన్న మీకోసం కార్యక్రమం

### మండల వ్యవసాయ అధికారి దేవి పద్మాలత

**చాపాడు మేజర్‌న్యూస్ :** రైతుల అభ్యున్నతికే రైతన్న మీ కోసం కార్యక్రమం నేటి నుంచి ప్రారంభం కానుందని మండల వ్యవసాయ అధికారిని దేవి పద్మలత అన్నారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ముఖ్యమంత్రి గారి దిశానిర్దేశాల ప్రకారం రైతుల జీవనోపాధి, ఆర్థిక స్థితి, నైపుణ్యాభివృద్ధికి శాశ్వత మార్పు తీసుకురావడమే లక్ష్యంగా ఈ వారోత్సవాలు ఇంటింటి ప్రచారం కార్యక్రమంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా నేటినుంచి 29 వరకు రైతుల ఇళ్లను సందర్శిస్తారు. నవంబర్ 30 నుండి డిసెంబర్ 2 వరకు సందర్శనల ద్వారా సేకరించిన డేటాను సమీకరించి వాటిపై విశ్లేషణ చేయాలన్నారు. డిసెంబర్ 3న 2026%-%27 సంవత్సరానికి చెందిన కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేయడానికి ప్రతీ రైతు సేవా కేంద్రంలో గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున రైతులందరూ ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ తహసీల్దార్ కృష్ణారెడ్డి, ఇంచార్జి ఎంపీడీఓ రామానుజయులు, అస్మా పీడీ విజయ లక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఎనర్జి అసిస్టెంట్ లు, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.



# రైతన్న మీ కోసంపై అధికారులకు అవగాహన సదస్సు

## ఎంపీడీవో మహబూబ్ బీ



**కలసపాడు, మేజర్‌న్యూస్ :** కలసపాడు ఎంపీడీవో కార్యాలయంలోని సభ భవనంలో ఎంపీడీవో మహబూబ్‌బీ అగ్రికల్చర్ ఏవో విజయ్ కుమార్ సంభందిత శాఖల ఆధ్వర్యంలో రైతన్న నీకోసం అనే పథకము రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 24వ తేదీనుండి 29 వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి రైతులు ప్రభుత్వం పై లబ్ధి పొందుతున్న రాయితీలు మరియు ప్రభుత్వం వ్యవసాయ రంగానికి కల్పిస్తున్న ఉపయోగాలపైన సచివాలయ సిబ్బంది కి అవగాహన కల్పించడం జరిగింది.సచివాలయ సిబ్బంది మండలంలోని రైతులకు ప్రభుత్వం సూచించిన సలహాలు ఈనెల 24వ తేదీనుండి 29 తేదీ వరకు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తారుఅని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి మహబూబ్ బీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, అగ్రికల్చర్ ఏవో విజయ్ కుమార్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు బర్సీ మహోత్సవం

## వైయస్సార్సీపి స్టేట్ జాయింట్ సెక్రెటరీ ఇస్మాయిల్



కమలాపురం మేజర్‌న్యూస్ : కమలాపురం పట్టణంలో వెలసిన శ్రీ హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి బర్సీ మహోత్సవాన్ని సోమవారం ఘనముగా నిర్వహిస్తున్నట్లు దర్గా కన్వీనర్. వైయస్సార్ సిపి స్టేట్ జాయింట్ సెక్రెటరీ ఇస్మాయిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దర్గా పీఠాధిపతి ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో స్వామివారి బర్సీ మహోత్సవాన్ని అంగరంగ వైభముగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పీఠాధిపతి నివాసం నుంచి స్వామివారికి, పూల చాదర్లు, గంధం ఊరేగింపుగా తీసుకువచ్చి మజార్ల పై సమర్పిస్తారని, అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. స్వామి వారి భక్తులు శిష్యులు విరివిగా పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# వివాహ వేడుకల్లో పాల్గొన్న టిడిపి బద్వేల్ ఇన్చార్జి రితీష్ రెడ్డి



**కాశినాయన మేజర్‌న్యూస్ :** కాశినాయన మండలంలోని ఉప్పులూరు గ్రామానికి చెందిన శ్రీ సింగాల శ్రీరాములు( హెడ్ కానిస్టేబుల్) మరియు శ్రీమతి. లక్ష్మీ దేవమ్మ దంపతుల ద్వితీయ పుత్రుడు, చిరంజీవి శ్రీ సాయి, మరియు కంజా దళాక్షిల, వివాహ మహోత్సవ వేడుకలు కలసపాడు లోని చిత్త రాజ మనోహర్ రెడ్డి కళ్యాణమండపం నందు నిర్వహించారు. ఈ వివాహ వేడుకలకు బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ కే.రితీష్ కుమార్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాశి నాయన తెలుగుదేశం పార్టీ మండల నాయకులు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి. రవీంద్రారెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఆర్ అండ్ బి రోడ్డు డెవలప్మెంట్ డైరెక్టర్ ఎస్. కె . రంతు. ఉప్పులూరు పోల్ రెడ్డి , రాజారెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, మస్తాన్, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ అర్హత పొందిన అభ్యర్థులకు పోస్టింగ్ ఇవ్వాలి

## డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని



**బి కోడూరు మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో గత ప్రభుత్వం ఇచ్చిన 6000 కానిస్టేబుల్ పోస్టులలో ప్రిలిమ్స్ పాసై మెయిన్స్ లో అర్హత సాధించి ఉద్యోగాల కోసం వేచి చూస్తున్న కానిస్టేబుల్ అభ్యర్థులకు ట్రైనింగ్ ఇచ్చి పోస్టింగ్ ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని డిమాండ్ చేసారు.ఈ సందర్భంగా డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం మాట్లాడుతూ... గత ప్రభుత్వం ప్రారంభంలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు 6000 ఉద్యోగాలకు భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది.తర్వాత 2023లో జూన్ లో ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించిందని ఈ పరీక్షకు నిరుద్యోగులు భారీగా 4లక్షల 49 వేల మంది రాసారు అన్నారు.తద్వారా అందులో 95 వేల మంది పై పరీక్షకు అర్హత సాధించారని తెలిపారు.తరవాత గత వైసీపీ ప్రభుత్వం కోర్టు కేసులు,నిర్లక్ష్యం కారణంగా సుదీర్ఘంగా నాలుగు సంవత్సరాలు సాగించి చివరికి గత ఎన్నికలలో ఓటమిపాలు చెందటం జరిగినదని అన్నారు.కూటమి ప్రభుత్వం ఎన్నికల లో కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేసే బాధ్యత మాది అని హామీ ఇచ్చిందని ఎన్నికలలో భారీగా గెలిచిందని అన్నారు.ఈ ప్రభుత్వం ఏర్పడినప్పుడు కూడా %ణ్ఖీ×% అనేక పోరాట ఫలితంగా జనవరి,ఫిబ్రవరి నెలలో ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించి జూన్ లో మెయిన్స్ పరీక్షలను నిర్వహించిందని 42000 మంది హాజరు అయ్యారని అన్నారు.తద్వారా 6000 మంది పోస్టులకు మెయిన్స్ లో అర్హత సాధించారని అన్నారు.వీరికి ఆగస్టు లో రిజల్ట్స్ కూడా వదిలారు అన్నారు.మెడికల్ పరీక్షలు నిర్వహించి పోస్టింగ్ ఇవ్వడంలో ప్రభుత్వం తస్కారం చేస్తుందని అన్నారు.గత నాలుగు సంవత్సరాలుగా కానిస్టేబుల్ మెయిన్స్ లో అర్హత సాధించి పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నారు అన్నారు.వారు వేరే ఉద్యోగానికి వెళ్లలేక,ఉన్నది వదులుకోలేక సతమతం అవుతూ మానసిక వ్యధ చెందుతున్నారు అన్నారు.కానీ ప్రభుత్వం ఈ కానిస్టేబుల్ ఉద్యోగాలు పోస్టింగ్ ఇస్తుందా లేదా అని క్లారిటీ ఇవ్వడం లేదన్నారు.కానీ లోకేష్ గారు మళ్ళీ కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తానని చెబుతున్నారని అన్నారు.ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తానని చెప్పారని కానీ ఆ హామీ అమలు కాలేదని అన్నారు.ప్రభుత్వ శాఖలో పోస్టులు చాలా ఖాళీలు ఉన్నాయని వాటిని భర్తీ చేయాలని అన్నారు.కావున ఇప్పటికైన కానిస్టేబుల్ మెయిన్స్ లో అర్హత సాధించి సెలెక్ట్ అయిన అభ్యర్థులకు ట్రైనింగ్ ఇచ్చి పోస్టింగ్ ఇవ్వాలని డివైఎఫ్ఐడిమాండ్ చేస్తున్నామని లేకుంటే నిరుద్యోగ అభ్యర్థుల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని అన్నారు.

# బంగారు వ్యాపారి విషయంలో పోలీసుల తీరు ఆక్షేపణీయం



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** బంగారు వ్యాపారి విషయంలో పోలీసుల తీరు ఆక్షేపణీయమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక నెహ్రూ రోడ్డు లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణానికి చెందిన తనికంటి జూవెలర్స్ యజమాని తనికంటి శ్రీనివాసులు, ఆయన తమ్ముడు వెంకటస్వామిని మొన్న రాత్రి పోలీసులు అక్రమంగా తీసుకెళ్లారని, ఈ విషయం లో ప్రొద్దుటూరు పోలీసుల తీరుపై ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాత్రంత్రం వచ్చి 78 ఏళ్ళైనా ప్రొద్దుటూరు ప్రజలకు మాత్రం స్వాతంత్రం లేదన్నారు. పోలీసులు సివిల్ మాటర్ లో ఎలా వ్యక్తులను తీసుకెళ్తారని ప్రశ్నించారు. ప్రొద్దుటూరు పోలీసులు 7 కోట్ల సెటిల్మెంట్ చేయాలని తనికంటి శ్రీనివాసులును ఎత్తుకెళ్లారని, పోలీసులు అతని ఇంటికెళ్లి దౌర్జన్యంగా కోట్ల విలువ చేసే ఆస్తుల పత్రాలు,బంగారు అంగడి తాళాలు తీసుకెళ్లారని, రక్షించాల్సిన పోలీసులే ఇలా చేస్తే ఇక ప్రజలకు రక్షణ ఎలా ఉంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు డబ్బులు రాబట్టడం కోసం కిడ్నప్ చేయడం ఏమిటని ప్రశ్నించారు తనికంటి వెంకట స్వామిని,మనోహర్ అనే అబ్బయిని విచక్షణ రహితంగా పోలీసులు కొట్టడం అమానుషం అన్నారు. ఉన్నతాధికారుల మెప్పుకోసం పోలీసులు ఇలా వ్యవహరించడం చట్టవ్యతిరేకమైన పనే అన్నారు. ఒక్కరోజంతా తీసుకెళ్లిన వాళ్ళను పోలీసులు చిత్రహింసలకు గురిచేయడం దారుణం అన్నారు. ప్రొద్దుటూరులాంటి వ్యాపార కేంద్రంలో పోలీసులు ఇలా ప్రవర్తించడం ఏమిటని ప్రశ్నించారు. పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని, కిడ్నాప్ చేసిన వారిని 48 గంటలు కావస్తోన్నా కోర్టుకు ఎందుకు హాజరుపరచలేదని ప్రశ్నించారు. శ్రీనివాసులు భార్య శ్రీలక్ష్మి డిఎస్పీ ఆఫీస్ దగ్గర 3 గంటల సేపు ఉన్నాకుడా డీఎస్పీ కనీసం ఆమెతో మాట్లాడలేదని, బ్రిటీష్ పరిపాలనే మేలు అనేలా ప్రొద్దుటూరులో పోలీసు వ్యవస్థ ఉందని వివరించారు. అధికారం ఉందని మనుషుల్ని హించించమని పోలీసులకు చట్టం ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి వెళ్తానని స్పష్టం చేశారు. వాళ్ళు చట్టబద్ధంగా వెళ్ళేపుడు పోలీసులు చట్టాన్ని చేతుల్లోకినంటేసుకుని వారిని కొట్టే అధికారం ఎవరిచ్చారన్నారు. అనంతరం తనికంటి శ్రీనివాసులు భార్య శ్రీ లక్ష్మి మాట్లాడుతూ ప్రొద్దుటూరు ప్రముఖ బంగారు వ్యాపార వేత్త హస్తం నా భర్త కిడ్నప్ వెనక ఉందని, మా ఆయన్ని పోలీసులు చంపుతామని బెదిరించారని, విజయవాడ పోలీసు అధికారి వసంత్ నన్ను కుడా బెదిరించారని వివరించారు. నా భర్తను ఆదివారం నుండి స్టేషన్ లో పెట్టి, కనీసం చూపించలేదన్నారు. తన భర్తకు సంబంధంలేని అప్పులు మాఫీ రుద్దాలని పోలీసులు చూస్తున్నారన్నారు. తన భర్తను కాపాడాలని ఎమ్మెల్యేను ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ వద్ది బాలుడు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ



**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల పట్టణంలోని కదిరి రోడ్డులోన విజయ గార్డెన్ ఫంక్షన్ హాల్లో బొల్లు శ్రీనివాస్ కుమార్ వివాహ సందర్భంగా నూతన వధూవరులను నందిని హిమదర్ దంపతులను ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి ఆశీర్వదించారు. అలాగే బ్రాహ్మణపల్లి రోడ్ లోని శ్రీకర్ ఫంక్షన్ హాల్లో తెలుగుదేశం పార్టీ నాయకుడు అన్నారెడ్డి బాలస్వామి రెడ్డి సోదరుడు కుమారుడు వివాహానికి హాజరై నిఖిల్ కుమార్ రెడ్డి భవ్య శ్రీలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సెమీ ఫైనల్ కి చేరిన కడప జిల్లా జట్టు

**పులివెందుల మేజర్‌న్యూస్:** 69వ రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ అండర్ 14 క్రీడలలో కడప బాలుర పులివెందుల మేజర్ న్యూస్మరియు బాలికల జట్లు సెమీఫైనల్ నందు ప్రవేశించాయి. బాలుర జట్టు ఈస్ట్ గోదావరిపై గెలుపొంది ప్రవేశించింది. అలాగే బాలికల జట్టు కృష్ణాజిల్లా పై గెలుపొంది సెమీఫైనల్ నందు ప్రవేశించినది. అలాగే ప్రకాశం బాలికల జట్టు కర్నూలు జట్టు పైన అనంతపురం బాలికల జట్టు విజయనగరం బాలికల జట్టు పైన ఈస్ట్ గోదావరి జట్టు గుంటూరు పైన గెలుపొంది సెమీఫైనల్ చేరినవి. అలాగే విశాఖపట్నం బాలల జట్టు గుంటూరు పైన విజయనగరం బాలుర జట్టు శ్రీకాకుళం పైన ఈస్ట్ గోదావరి బాలుర జట్టు చిత్తూరు పైన గెలుపొంది సెమీఫైనల్ లో ప్రవేశించాయి. రేపు ఉదయము సెమీఫైనల్ ఫైనల్స్ పోటీలు నిర్వహించబడును. ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.



